# దయ్యాల...పెళ్లి ....

దేశిరాజు కృష్ణశర్మ

౧

అర్థరాతిరి, అడివిమార్గము
ఆవులించిన అంధలోకము
చుట్టుపక్కల శూన్యదృక్కుల
బావురంటూ బారజాచింది.

*

పిరికిగుండెల పీల్చి తీసిన
నల్ల నెత్తురు తలకుబోసుక,
కారుమబ్బుల కాటుకెట్టి
కటిక చీకటి గండ్రదుప్పటి
కాసిపోసింది.

మొద్దుగుండెల మొండి-చీకటి
రంగు రవికను సొగసుల దిద్ది
తొడిగింది.

దుఃఖగాధలు, దురితబోధలు
కడుపునిండుగ గర్భభారము
కదలజాలక కదలజాలక
కాళరాతిరి కాలుజాచింది.

ఝల్లుమని అడవెల్ల ఝలబరించింది.
చెట్టుపుట్టలు, కొండకోనలు
చింతచెట్టూ, చివరకొమ్మయు
పొర్లుపొర్లుగ పులకరించాయి.

౨

దయ్యాలు భూతాలు ప్రేతపిశాచాలు
ధగధగల తళతళలు
భగభగల పెళపెళలు
ఢంఢంలధణధణలు
శాకినిలు ఢాకినిలు కామినిలు భైరవులు
కల్లోలకాంతులూ కలగలపురోచులూ
వజ్రాల బెళుకులూ వరహాలమూటలూ
రత్నాలరవళులూ రాయంచనడకలూ
ఉరుములో మెరుపులో హూంకరించాయి
మేఘాలమార్గాన మిటకరించాయి
బ్రహ్మరక్షసి తండ్రి భ్రూణహత్యల తల్లి
బాలరక్షసి పెండ్లి భేతాళ వియ్యంబు
ఎన్నెమ్మ పున్నెమ్మ పిన్నిముత్యాలమ్మ
ఎన్నో వేషా లేసి ఎదురు వెళ్లారు
తక్కుతూ తారుతూ తరలివెళ్లారు.

మిడిగుడ్ల చాలులూ
నడినెత్తి చూపులూ
కోరమూతుల కొక్కిరింతలు
దుప్పిచెవులా దులబరింపులు
కొండ శిఖరం గొప్పదేహాల్
బానకడుపులు బండకాళులు
నడిచినా సురుగుళ్లు తిరుగూ
పరుగులో సుడిగాలి మళుపూ



http://www.maganti.org/

మడిమముందుకు వేళ్లు వెనుకకు
పరుగుపరుగున బారదూరం.

౩

హెంహేంభాయి హోంహోంభాయి
హెంహేంభాయి హోంహోంభాయి
వెనుకముందుల చూడబోకోయి
ఓపెళ్లికొడుకా
పెళ్లికూతురు పగలనవ్వేనోయి
అహోంహం ఒహోంహం
అహోంభాయి ఒహోంభాయి

అందాలపల్లకి ఆహా మేఘాలపై
గజ్జెలగుర్రమే కోరుకున్నావా
ఓపడుచుపిల్లా
పూర్వవాసనమహిమ పొంగిపోయేవా
ఓ పెళ్లిపడుచూ
ఉహూంహూం ఒహోంహూం
హేంహేంహెం అహేంహేం

మనకు లొంగనివాడు
మహిం లేనివాడు
మనలమెచ్చినవాడు మరియాదవాడు
మనసులో నరకంబు
నరకసౌఖ్యంబు
మనసుమార్గం తెలిసి
మనలగుప్పెట నిలిపి

ఏడ్పులో ఎదకోయుకోతలో
చూపులో నిశితంపుబాధలో
నవ్వులూ పువ్వులూ నాల్గుకాయలుకాయ
సౌఖ్యాన చరియించు సాధువెవ్వడులేని

ధరణిపై మనకింక స్వేచ్ఛగా
ఊరేగుదము పెళ్లి
ఊరెల్ల ఊర్పుగా
ఓ పెళ్లికొడుకా
ఊరేగవోయి ! మనసు
ఉయూ్రిత లూగగా
పారతంత్ర్యపు ప్రజలు
దారిద్ర్యకూపాన దుఃఖవాహినిలోన
బుడకల్లు పెట్టగా
ఊరేగవోయి! మనసు
ఉయూ్రిత లూగగా

*

పల్లకీ లేచింది ప్రాణి లేచింది
పల్లకీ బోయీలు పాటపాడారు
అడవిలో నిలువెల్ల హడిలిపోయింది
తప్పెట్లు తాళాలు డోలు రంఢోల్లాను
ఢుంఢియ్యా ఢుంఢియ్యా తూగిపోతున్నాయి

౪

ఉత్తరానా మర్రిచెట్టు
ఉరిమి చూచింది
కొరవిదయ్యం శ్రీమణిభిక్షువు
గొల్లుమన్నారు
వల్లకాటిలో దుమ్ము దుమ్ముగ
ధూళి రేగింది

తుమ్మచెట్టూ తూలివిరిగెను
బొబ్బరింతలు పొక్కిపోయెను
ఎండుమంటలు నాట్యమాడగ
నక్కలూ తోడేళ్లు ఎగిరెనై

జీవితేచ్ఛలు సుఖము దుఃఖము
తోడుతోడుగ చితిని పేర్చగ
మాయమైనది మాయదేహం

రోజుతూ ఈమంట
పొక్కుతూ ఈధూళి
ఎన్నేళ్లు గడిచినా ఏడారిపోయినా
తమదగ్గరకు
కడసారిమార్గమని
చాటి చెప్పినవి

*

మండుచున్నా పోదకోఅవిలో
మండల న్యాసంబుచేసే
మనిషి, కంకాళీ!
చేతివేళ్ళల చిన్నపురేఖ
చిటిలు మన్నాది.
ఓశ్రీమణభితూ!
లేచి రావోయి!

మంత్రమూ తంత్రమూ మాటమరిచేవా
పెళ్లికీ పెద్దలూ ఎవరు లేరోయి.

శింశుపా చెట్టుపై బిగురువోసే దెవరు
చీకటీమ్రానుపై చిగురు నిలిపే దెవరు
నల్లకానుగ చెట్టు ఎరుపు చేసే దెవరు
ఇల్లువాకిళ్లన్ని ఎర్రనీమయముగా
నెత్తురూ - కాళాపి
బొమికలూ - ముగ్గుగా
తీరుగా అలికి తీర్చిం దెవరు
నల్లనీ దిక్కులా ఎరుపు నిల్పిన దెవరు
రండోయి! భూతాలు లేచి రారండి!
రండి! పేరంటాళ్లు రండి రారండి.

లోకమంతా నల్లకాడూ
మండుతున్నది మంచిమార్గం
బొగ్గుగా మారింది న్యాయం
ధర్మమంతా గాలిలో
ధూళిలో తేలిపోయింది.



http://www.maganti.org/

Source: A.P. Press Academy Website, Pratibha Patrika - 1938

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan